కంటికి సాధారణంగా కనిపించే సత్యం- అన్నది నిర్వివాదాంశం.

## నాస్తికవాదం - ఆస్తికవాదం

"మరణం తర్వాత జీవితం లేదు; మరణమే జీవితానికి తుది మెట్టు" అన్న దృక్పథమే 'నాస్తికవాదం' అనాదిగా ఇది అన్ని దేశాలలోనూ వుంది. అయితే, తత్‌విరుద్ధంగా అనాదిగా అన్ని దేశాలలోనూ 'ఆస్తికవాదం' కూడా ప్రబలి వుంది.

ఈ ఆస్తికవాదం ఏమంటూందంటే 'మరణం' అనేది జీవితానికి 'తుదిమెట్టు' కాదు; మానవ శాశ్వత జీవితంలో అది ఒకానొక మలుపు మాత్రమే. అనాదిగా ఆస్తికవాదం అన్ని దేశాలలోనూ ఇలానే చెప్తూ వుంది. ప్రపంచ వ్యాప్తంగా లెక్కవేసుకోవాలంటే నిజమైన నాస్తిక వాదులను వ్రేళ్ళ మీద లెక్కపెట్టువచ్చు. 99% ఉన్నదంతా ఆస్తికవాదులే! ఏదో ఒక మతానికి చెందిన వార్తై వున్న వారే వీరంతా కూడా! వీరు "మరణానంతర జీవితానికి 'దేహం లోని జీవితం' అన్నది ఒక నాంది, ఒక పునాది" అని నమ్ముతున్న వారు....; మరి ఆ విధంగానే జీవిస్తున్నవారు.

అలాగే, నిజమైననాస్తిక పరులను కూడా వ్రేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. మరి మిగతా నాస్తికులు కేవలం నాస్తికులుగా నటిస్తున్నవారే. అంతరాంత రాల్లో 'మరణానంతర జీవితం వున్నదేమో' అని అనుమానిస్తున్న వారే.

వివిధ మత ప్రవక్తలు, వివిధ మతాలను స్థాపించిన వారు, యోగ మూర్తులైన వారు - వీరంతా తాము స్వంతంగా కనుక్కున్న సత్యం ఏమి టంటే "మరణం తర్వాత జీవితం వుంది" అని. వారి తర్వాత వారి శిష్య ప్రశిష్య అనుయాయులైన కోట్లాదిమంది తమ తమ మూల మత ప్రవక్తలు, యోగమూర్తులు ప్రవచించిన వాటిని కొద్దిగానో, గొప్పగానో నమ్మి తమ జీవితాలను ఆ విధంగా కొనసాగిస్తున్నవారు- ఆస్తికులుగా... ఆస్తిక వాదులుగా!

నిజమైన ఆస్తికులలో, నాస్తికులలో వున్నంత పరుగులాట, కీచులాట వుండదు! వారికి మరణాంతర జీవితం వుంది! అన్నీ ఇప్పడే సాధించు కోవలసింది లేదు! క్రమక్రమంగా అన్నీ లభిస్తాయి అన్న అవగాహన వుంది.

## హింసా ప్రవృత్తి

హింసా మార్గంలో వున్నవారికి మరణానంతర జీవితంలో సరైన జీవితం లభించదని కూడా - ఈ మత ప్రవక్తలు, యోగమూర్తులు- అందరూ చెప్తారు. కనుక, హింసా ప్రవృత్తి ప్రబలంగా వున్న మానవ జీవితాల్లో అహింసా ప్రవృత్తి వ్యక్తం కావడానికి ఈ ఆస్తికవాదం ఎంతైనా

